# కొనసాగుతున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 22 : పోలీసు సంస్మరణ వారోత్సవాలను ఈనెల 21న ప్రారంభించామని సీపీ కల్మేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంతో మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించారని, వారి త్యాగాలను గుర్తు చేసుకోవడంలో భాగంగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్

## విద్యార్థులు, సిబ్బందికి పోటీలు : సీపీ

అంజనీకుమార్ ఆదేశాల మేరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్ల ఏరియాల్లో విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహిస్తామని వివరించారు. 8వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీల్లో (తెలుగు/ ఇంగ్లిష్/ ఉర్దూ) పాల్గొనేందుకు ఈనెల 23వ తేదీలోగా https://forms.gle/b7bejvzfo6j29Vuz6 ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. 24న కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్సై/ఏఆర్ఎస్సై/ఎస్సై, పైస్థాయి వరకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. https://forms.gle/XFzUKnmcbCC4YW4Y9 వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 25న ఆన్‌లైన్ ద్వారా ఓపెన్ హౌస్/ఫిజికల్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నగరంలోని పరేడ్ గ్రౌండ్‌తో పాటు అన్ని పోలీస్‌స్టేషన్లలో నిర్వహిస్తామని తెలిపారు. పోలీస్‌రేడ్ గ్రౌండ్‌లో రక్తదాన శిబిరం సైతం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 26న జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి పోలీస్‌పరేడ్ గ్రౌండ్ వరకు క్యాండిల్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. 28న మూడు నిమిషాల నిడివి గల షార్ట్‌ఫిల్మ్ కాంపిటేషన్‌ను ఏసీపీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, ఇదే రోజు పోలీసులకు సంబంధించిన అంశాలపై ఫొటోగ్రఫీ కాంపిటేషన్ సైతం ఉంటుందని వివరించారు.



నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని వెంగళ్‌రావు నగర్‌లో ఉన్న ప్రభుత్వ ఉర్దూమీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ప్రత్యేక శిక్షకుడి ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. గతేడాది నుంచి ప్రభుత్వం నెల రోజుల పాటు శిక్షణ ఇప్పించే కార్యక్రమం చేపట్టింది. కానీ విద్యార్థినుల తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రధానోపాధ్యాయుడు భూమయ్య తన సొంత ఖర్చులు నెలకు రూ. 5 వేలు అందజేస్తూ ప్రత్యేక శిక్షకుడిని నియమించి పాఠశాలలోని 70 మంది విద్యార్థినులకు శిక్షణ ఇప్పిస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





# రేపు మంజులమ్మ ద్వాదశ దినకర్మ

### వేల్పూర్ మినీ స్టేడియంలో ఏర్పాట్లు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 22: రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి మంజులమ్మా సురేందర్‌రెడ్డి ఈ నెల 12న మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె ద్వాదశ దినకర్మను కుటుంబ సభ్యులు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు వేల్పూర్ మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి తండ్రి వేముల సురేందర్‌రెడ్డి లాగే తల్లి మంజులమ్మ సైతం అందరికీ ప్రేమానురాగాలు పంచే తత్వమున్న వారు. ఆమె ప్రేమ, ఆదరణను మరువలేమని వేముల కుటుంబం అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు. రైతు నాయకుడైన తన భర్త వేముల సురేందర్‌రెడ్డి సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో మంజులమ్మ ఎల్లప్పుడూ తన ప్రోత్సాహాన్ని అందిస్తూ వచ్చారు. వేముల సురేందర్‌రెడ్డి 2016లో మృతి చెందారు. తండ్రి అడుగుజాడల్లో నడిచిన కొడుకులు, కూతురు ప్రశాంత్‌రెడ్డి, రాధికారెడ్డి, అజయ్‌రెడ్డిని మంజులమ్మ ఉన్నతంగా తీర్చిదిద్దారు.

మంజులమ్మ మృతిచెందడంతో మంత్రి కుటుంబ సభ్యులను సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత సహా ప్రముఖ నాయకులు, ఆత్మీయులు, అభిమానులు పరామర్శించి ఓదార్చారు. మంగళవారం నిర్వహించనున్న మంజులమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి అభిమానులు, ఆత్మీయులు, ప్రముఖులు తరలివచ్చి నివాళి అర్పించనున్నారు.

# అల్లరి

ALLARI




## విజయదశమి

కథ

**పూర్వం** మహిషాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మదేవుడి గురించి తీవ్రమైన తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన బ్రహ్మ.. ''ఏ వరం కావాలో కోరుకో!'' అన్నాడు. దానికి మహిషుడు.. ''నాకు ఏ పురుషుడి చేతిలోనూ మరణం లేకుండా వరం ఇవ్వు స్వామీ!'' అని కోరుకున్నాడు. బ్రహ్మ ''తథాస్తు!'' అనడంతో.. మహిషుడికి ఎక్కడలేని అహంకారం పెరిగిపోయింది. ఈ వరం కోరుకోవడం వెనుక మహిషాసురుడి ఉద్దేశం.. ఆడవాళ్లు తనను ఏమీ చేయలేరనే అహంకారమే! కానీ, ఆ అహమే తనను అంతం చేస్తుందని అతడు తెలుసుకోలేకపోయాడు. వరం పొందిన మహిషుడు దేవతలను, ప్రజలను హింసించేవాడు. దాంతో వారంతా త్రిమూర్తుల దగ్గరికి వెళ్లి మొరపెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మ – విష్ణు – మహేశ్వరులు.. ''మేము మహిషుణ్ని అంతం చేయలేము. అది బ్రహ్మ ఇచ్చిన వరం! కానీ, ఒక మహిళ చేతిలోనే మహిషుడు అంతమవుతాడు!'' అని చెప్పారు. దాంతో ఇంద్రాది దేవతలంతా కలిసి త్రిమూర్తుల సహాయంతో.. 18 చేతులు కలిగిన ఒక స్త్రీ శక్తి రూపాన్ని సృష్టించారు. ఆ శక్తికి విష్ణుమూర్తి సుదర్శన చక్రాన్ని, శివుడు త్రిశూలాన్ని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని సమర్పించారు. అలా దేవతలంతా తమతమ ఆయుధాలను ఆ శక్తికి సమర్పించారు. అలా 18 చేతుల్లో మారణాయుధాలను ధరించిన ఆ శక్తే.. దుర్గామాతగా అవతరించింది. ఈ ఆయుధాలకు తోడు అత్యంత శక్తి గల వాహనం సింహాన్ని కూడా సమర్పించారు. అలా సకల ఆయుధాలతో మహిషాసురుడితో యుద్ధం ప్రారంభించింది దుర్గాదేవి. ఆ యుద్ధం తొమ్మిది రోజులు సాగింది. చివరికి అమ్మవారు పదో రోజున మహిషుణ్ని సంహరించింది. యుద్ధం చేసిన ఆ తొమ్మిది రోజులే దేవీ నవరాత్రులుగా మారాయి. మహిషుణ్ని సంహరించినందున, దుర్గామాత విజయానికి గుర్తుగా.. పదోరోజు విజయదశమిగా మారింది. దశమి రోజున విజయం సిద్ధించింది కాబట్టి.. ప్రజలంతా ఈ రోజును విజయదశమిగా జరుపుకొంటారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తే.. దసరా పండుగ.

### రంగులేయండి

కింద ఇచ్చిన 'రావణ దహనం' బొమ్మకు రంగులేయండి.






### తెలుసుకుందాం

1. రామాయణంలో రావణుడిపై విజయం సాధించడానికి రాముడు ఏ పూజ చేశాడు?
   – దుర్గాపూజ
2. పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేముందు తమ ఆయుధాలను ఏ చెట్టుపై ఉంచారు?
   – శమీ వృక్షం (జమ్మి చెట్టు)
3. దసరా పండుగను మొత్తం ఎన్ని రోజులు జరుపుకొంటారు?
   – పది రోజులు

### శ్లోకం

శమీ శమయతే పాపం
శమీ శత్రు వినాశనం
అర్జునస్య ధనుర్ధారి
రామస్య ప్రియదర్శిని॥

### మంచిమాట



ధనం రూపంలో లక్ష్మీదేవి ప్రపంచాన్ని పోషిస్తున్నది. జ్ఞానం రూపంలో సరస్వతీ మాత ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తున్నది. శక్తి రూపంలో దుర్గామాత ప్రపంచాన్ని నడిపిస్తున్నది. కాబట్టి, వేర్వేరు రూపాల్లో కనిపించినా.. ఈ ముగ్గురూ ఒక్కరే. ఆమే.. అందరికీ జగన్మాత!

### లిటిల్ హ్యాండ్స్

ఏనుగుల యోగేందర్
ఖమ్మం



### చెప్పుకోండి

దసరా పండుగ రోజున ఈ పిట్టను చూడటం శుభ సూచకంగా భావిస్తారు. ఇంతకీ ఇది ఏ పిట్ట?



జవాబులు :

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా :
zindagi@ntnews.com